క్లుప్తంగా

వీధి దీపాల పునరుద్ధరణ



వీధి దీపాల్ని బిగిస్తున్న సిబ్బంది

కోటవురట్ల : కె.వెంకటాపురం గ్రామంలో సోమవారం వీధి దీపాల పునరుద్ధరణ పనులు చేపట్టారు. 6వ వార్డులో పలు దీపాలు పాడవడంతో వాటి స్థానంలో కొత్తవి బిగించారు. సర్పంచ్ పైల శ్రీదేవిమంగా ఇందిరభవాని మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

హనుమాన్ ఆలయాల్లో భజనలు



కుమారపురం హనుమాన్ ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

పాయకరావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాల్లో భక్తి కీర్తనలు ఆలపిస్తున్నారు. ఆయా గ్రామాల్లో భజన బృందాలు ఆలయ ఆవరణలో చేరి భజనలు చేస్తున్నారు. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా వారం రోజులపాటు సాగే ఈ కార్యక్రమంలో భజన బృందాలు, స్థానిక భక్తులు పాల్గొని భజన పాటలు, కీర్తనలను ఆలపిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వేసవి శిబిరంలో క్విజ్ పోటీ



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పడం సాధన చేయించారు. అనంతరం క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అప్పలరాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండల కేంద్రంలో యువశక్తి ఆటోస్టాండ్ కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐటీయూ మండల కార్యదర్శి కె.సోమునాయుడు సోమవారం ప్రారంభించారు. అందరికీ మజ్జిగను అందించారు. కార్యక్రమంలో యువశక్తి ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు డి.చండీ, కార్యదర్శి పి.అప్పారావు, కోశాధికారి సన్నీ, సభ్యులు బాబు, రాజు, శ్యామ్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



దిమిలి గ్రంథాలయంలో యోగా చేస్తున్న చిన్నారులు

రాంబిల్లి: యోగాతో మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని దిమిలి శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ ఎస్.శకుంతల అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా సోమవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగా చేసే విధానాన్ని వివరించి విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



రామారాయుడుపేటలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : గ్రామాల్లో డ్రైనేజీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) అన్నారు. మండలంలోని రామారాయుడుపేట, వెంకటాపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను అందించి, స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇళ్ల పట్టాతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమయ్యే సాయం ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని అభ్యర్థించారు.

ప్రజలంతా జగన్ వెంటే:

ప్రజా సమస్యల పరిష్కారానికి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాటుపడాలని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు కోరారు. వెంకటాపురం సచివాలయం వద్ద వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతీ నిరుపేదకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచినట్టు తెలిపారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్నే కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. సంబంధిత నిధులతో సచివాలయ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. అనంతరం వలంటీర్లకు సొంత నిధులతో కొనుగోలుచేసిన బ్యాగ్‌లను అందించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్‌లు మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు, సుందరపు తాతాజీ, కిలాడి దేముడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, పార్టీ నేతలు దొడ్డి బాలాజీ, మద్దాల జగ్గారావు, మందా రాము, రామ్మోహనరావు, శ్రీరామమూర్తి, జానకీరామ్, బుజ్జి, జగదీష్, కనకప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



పాఠశాల అదనపు గదులకు శంకుస్థాపన చేసిన పార్టీ నాయకులు

పాయకరావుపేట : మండలంలోని పాల్తేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో అదనపు తరగతి గదులు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. నాడు–నేడు పథకంలో భాగంగా రూ.96 లక్షలతో తరగతి గదులు నిర్మాణం చేపట్టనున్నారు. గ్రామ సర్పంచ్ గోసల కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు సూర్యచక్రం కొబ్బరికాయలు కొట్టి పనుల్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ, ఎంపీటీసీ మాకినీడి చిట్టిబాబు, నాయకులు దేవవరపు వాసు, ఉప సర్పంచ్ దేవవరపు, స్థానిక నాయకులు శివరాజు, గోనెల సత్తిబాబు, కొంకిపూడి రాజుకొండ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోండి



మునగపాకలో ఉపాధిహామీ పనుల్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : ఉపాధిహామీ పథకాన్ని జాబ్‌కార్డుదారులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మునగపాక సంతబయిల శీలప్పన్న చెరువులో జరుగుతున్న పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలు, చెరువులు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్డుదారులకు పనికి తగ్గ వేతనాలు అందుతాయన్నారు. ఉపాధి పనులు కావాలనుకునే వారికి 24 గంటల్లో జాబ్‌కార్డులు అందించనున్నట్టు వెల్లడించారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో ధర్మ పరిరక్షణ



గోవిందపాలెంలో ధర్మప్రచార ర్యాలీలో పాల్గొన్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

రాంబిల్లి : ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పప్పల నూకన్నదొర అన్నారు. గోవిందపాలెంలో సోమవారం ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నూకన్నదొర మాట్లాడుతూ గ్రామాల్లో భక్తిభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ కె.అప్పారావు, మండల కన్వీనర్ ఎస్.నూకరాజు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు

ఎస్.రాయవరం : చెరువుల్లో మట్టిని తవ్వి, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని యలమంచిలి డీఈ సుజాత హెచ్చరించారు. వమ్మవరం గ్రామం చెరువుల్లో అనుమతులున్నాయని చెప్తూ, అక్రమంగా మట్టిని తరలిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం ఆమె చెరువు పరిసరాలను, అనుమతులు ఇచ్చిన ప్రదేశాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కొరుప్రోలు చెరువులో అక్రమ తవ్వకాలు జరిగినట్టు ఆమె దృష్టికి వచ్చింది. అనుమతులు లేకుండా ఏ ఒక్కరు మట్టి తవ్వకాలు చేపట్టినా సహించేది లేదన్నారు. మట్టి అవసరం ఉన్నవారు దరఖాస్తు చేసుకున్న మేరకు అనుమతులు ఇచ్చామన్నారు. అనుమతులున్నాయన్న పేరిట అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ పరిశీలనలో డీఈ వెంకట్, ఏఈ చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న
- సీతానగరంలో 6400 కిట్ల పంపిణీ



రైతులకు విత్తనాల కిట్లు అందిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న

అనకాపల్లి రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో భూమికి, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్ లచ్చన్న తెలిపారు. సోమవారం సీతానగరంలో అనకాపల్లి, కశింకోట మండలాల్లోని 24 గ్రామాలకు చెందిన రైతులకు 6400 విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోందన్నారు. ఈ విధానం ద్వారా సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు రసాయనరహిత, ఆరోగ్యకరమైన పంటలులుగా పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ఎన్నో రాయితీలిస్తూ, ప్రోత్సహిస్తోందన్నారు. విత్తనాల కిట్లలో నవధాన్యాల సాగుకు సంబంధించిన విత్తనాలతో పాటు 30 రకాలున్నట్టు వెల్లడించారు. ప్రతి ఇంట్లో పెరటి సాగు ద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చని సూచించారు. ఈ తరహా వ్యవసాయం ద్వారా పెట్టుబడి తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఘన, ద్రవ జీవామృతం తయారీ, కషాయాల తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో సీతానగరం, వెంకుపాలెం, తగరంపూడి, సుందరయ్యపేట సర్పంచ్‌లు చంటి, నాగేశ్వరరావు, అప్పారావు, డి.ధనలక్ష్మి, ఎంపీటీసీలు ఏ రాము, వెంకటేశ్వరరావు, డి.తాతారావు, ప్రకృతి వ్యవసాయ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి భూముల కౌలు వేలం రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణస్వామి వారి దేవాలయం హక్కుభుక్తంలో భాగంగా ఈ నెల 17న ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.ఆదినారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే నెం.1616/1లో 2.38 ఎకరాలు, సర్వే నెం.1662/2సీలో 58 సెంట్లు, సర్వే నెం.1662/2బీలో 56 సెంట్లును ఈ ఏడాది జూన్ 1 నుంచి 2026 మే 31 వరకు మూడేళ్లు కౌలుకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు.

విద్యార్థులు యోగా పట్ల శ్రద్ధ చూపాలి



యోగాభ్యసనలో విద్యార్థులు

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి యోగా పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతీ రోజు యోగాభ్యాసన చేయాలని యోగా గురువు సీతారామయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం భాగవతంలో ముఖ్య అంశాలపైన, తెలుగు, ఇంగ్లీష్ మాట్లాడటంలో మెలకువలను నేర్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సీతారామయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వడగాడ్పులతో విలవిల

రాంబిల్లి : వడగాడ్పులు, మండుటెండలతో మండలవాసులు మంగళవారం అల్లాడిపోయారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎండ, వేడిగాలులు కొనసాగాయి. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. ఉపాధి కూలీలు, రైతులు ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, చిన్నారులు బయటికి రాలేక అవస్థలు పడ్డారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : గత రెండు రోజులుగా జరుగుతున్న స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. గౌరీపరమేశ్వరులను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, నియోజకవర్గ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు వైఎస్సార్‌సీపీ నేతలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఏఎంఏ పాలిటెక్నిక్ కళాశాల నూతన కార్యవర్గం

అనకాపల్లి రూరల్ : స్థానిక అనకాపల్లి వర్తక సంఘం కొణతాల సుబ్రహ్మణ్యం, ఇమ్మిడిశెట్టి కనకరాజు పాలిటెక్నిక్ కళాశాల నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. ఇటీవల కళాశాలకు కొత్త కార్యవర్గాన్ని నియమిస్తూ వర్తక సంఘం పాలకవర్గం తీర్మానించింది. ఈ మేరకు సోమవారం పాలిటెక్నిక్ కళాశాల కొత్త గవర్నింగ్ బాడీ కొలువుదీరింది. కళాశాల గవర్నింగ్ బాడీ మీటింగ్ హాల్లో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల నూతన కార్యవర్గం అధ్యక్షునిగా కొణతాల బాల సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్‌గా ఏఆర్ఎల్ నర్సింగరావు, కోశాధికారిగా కేవీఎస్ఆర్‌కే అచ్యుతరామయ్య, ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొణతాల లక్ష్మీనారాయణరావు(పెదబాబు), తమ్మన రఘుబాబు, సభ్యులుగా మళ్ల సూర్యప్రకాశరావు(సురేష్), పెంటకోట బాలకృష్ణ, కాండ్రేగుల రవీంద్రనాథ్, కేపీకే అప్పలరాజు, బొండాడ రాజేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్ర ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన సభ్యులకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పలువురు వర్తకసంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి పెంటకోట వెంకట రామారావు(శ్రీను), ధరాల కృష్ణ పేర్రాజు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

వంట గ్యాస్ వినియోగంపై కళా ప్రదర్శన



గ్యాస్ వాడకంపై అవగాహన ప్రదర్శనలో కళాబృందం

యలమంచిలి : వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం యలమంచిలి పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో కళా ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు పాటల రూపంలో వంట గ్యాస్ వినియోగం, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని ప్రజలకు తెలిసేలా వివరించారు. వేసవికాలంలో గ్యాస్ వాడకంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, గ్యాస్‌పై వంటలు చేస్తున్నప్పుడు ఎలాంటి దుస్తులు వాడాలి, గ్యాస్ ట్యూబ్ సామర్థ్యంపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

'వేసవి శిబిరాలను వినియోగించుకోండి'



నీతి కథలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు జగదీష్

మునగపాక : విద్యార్థులందరూ వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిల్లా జగదీష్ కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం నీతి కథలపై పిల్లలకు అవగాహన కల్పించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా, విద్యార్థులు గ్రంథాలయాలల్లో పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అలాగే క్విజ్‌పై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండే పుస్తకాలపై దృష్టి సారించాలన్నారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



బోదిగల్లం రోడ్డులో లైన్స్ ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు



జాతీయ రహదారిపై కాంప్లెక్స్ వద్ద కొత్తగా వేస్తున్న లైన్స్

నక్కపల్లి : ఇటీవల జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం సోమవారం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధాన కూడళ్లు, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో వేగంగా వచ్చే వాహనాల నియంత్రణకు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్, బోదిగల్లం కూడళ్లలో పాదచారుల కోసం జీబ్రాలైన్స్ వేయించారు. జాతీయ రహదారిపైకి చేరుకునే సమయంలో వాహనదారులు ఈ లైన్ వద్ద ఆగి ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ప్రధాన కూడలి వద్ద ఇటువంటి హెచ్చరిక లైన్స్ లేకపోవడంతో రోడ్డుక్రాస్ చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఐ శిరీష తెలిపారు. బోదిగల్లం రోడ్డు నుంచి సుమారు 10 గ్రామాల వారు నక్కపల్లి వచ్చి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారని, ఇక్కడి కాంప్లెక్స్ రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఉపమాక వైపు నుంచి వచ్చే 10 గ్రామాల వారికోసం ఉద్దండపురం, గొడిచెర్ల, వేంపాడు ప్రధాన కూడళ్లలో కూడా జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

కుండలదేవునిపాలెంలో 'గడప గడపకు' నేడు

రాంబిల్లి : స్థానిక సచివాలయం పరిధిలోని కుండలదేవునిపాలెంలో మంగళవారం ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని స్థానికులకు వివరించి, స్థానిక సమస్యల్ని తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

గ్రోయిన్ మరమ్మతులకు వినతి



ఎంపీ సత్యవతికి వినతి పత్రం అందిస్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం : వరాహనదిలో పెదఉప్పలం, ఎస్.రాయవరం గ్రోయిన్ మరమ్మతులు చేపట్టాలని ఎంపీ భీశెట్టి సత్యవతికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు సోమవారం వినతి పత్రం అందజేశారు. గడిచిన ఎనిమిదేళ్లుగా ఈ గ్రోయిన్ దెబ్బతిని సాగునీరు వృథాగా పోతోందని, నాట్లు సీజన్‌లో రైతులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా, ఫలితం ఉండట్లేదని వాపోయారు. ఇటీవల ఈ గ్రోయిన్ మరమ్మతుకు ప్రభుత్వం రూ.35 లక్షలు విడుదల చేసినా, కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. ఎస్.రాయవరం సర్వసిద్ధి పంట కాలువ పూడిక తీత పనులు చేపట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి పనులు ఆలస్యం అయితే ప్రైవేట్ పరిశ్రమల సీఎస్సార్ నిధుల్ని కేటాయించి, పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని అభ్యర్థించారు. ఎంపీని కలిసినవారిలో వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, ఎస్.రాయవరం సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి ఉన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



వలంటీర్ గోవింద్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



ప్రాణాపాయం నుంచి బయటపడ్డ బాలుడు చరణ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మునగపాక : రోడ్డు ప్రమాదంలో మృత్యువాతకు గురైన మండలంలోని వెంకటాపురం వలంటీర్ వై.గోవింద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబురాజు), డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మలు సోమవారం పరామర్శించారు. ఇటీవల యలమంచిలి మండలం రేగుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వలంటీర్ గోవింద్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు వలంటీర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, ఉప సర్పంచ్ సాయివజ్రం, ఎంపీటీసీ వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరబుపాలెం గ్రామానికి చెందిన బాలుడు ఇటీవల అనకాపల్లిలో స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ప్రాణాపాయం నుంచి బయటపడి అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. బాధిత బాలుడు చరణ్‌ను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పరామర్శించారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.